# ఇండియన్ పాలిటీ

## భారత రాష్ట్రపతి

భారత రాష్ట్రపతి రాజ్యాధినేత, దేశానికి ప్రథమ పౌరుడు. భారతదేశ సార్వభౌమత్వానికి, జాతి గౌరవ ప్రతిష్ఠలకు ప్రతీక. రాజ్యాంగంలోని Vవ భాగంలో 52 నుంచి 62 వరకు ఉన్న నిబంధనలు రాష్ట్రపతి పదవి గురించి వివరిస్తాయి. రాజ్యాంగం ప్రకారం (నిబంధన 53) కేంద్ర ప్రభుత్వ కార్య నిర్వహణాధికారమంతా రాష్ట్రపతికే ఉంటుంది. దేశ పరిపాలన రాష్ట్రపతి పేరిట జరుగుతుంది (నిబంధన 77). అయితే పార్లమెంటరీ సంప్రదాయం అమల్లో ఉన్నందువల్ల రాష్ట్రపతి రాజ్యాంగబద్ధమైన నామమాత్ర అధికారాలను మాత్రమే చెలాయించగలడు. వాస్తవ అధికారాలు ప్రధానమంత్రి నాయకత్వంలోని మంత్రివర్గానికి చెంది ఉంటాయి. అయినప్పటికీ రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత ఉండటం వల్ల కొన్ని సందర్భాల్లో స్వతంత్రంగా వ్యవహరించగలడు.

**అర్హతలు**

★ రాజ్యాంగంలోని 58వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి పదవికి పోటీ చేయడానికి కింది అర్హతలు అవసరం.

★ భారత పౌరుడై ఉండాలి.

★ వయసు 35 సంవత్సరాలు నిండి ఉండాలి.

★ లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికవడానికి కావాల్సిన అర్హతలు ఉండాలి.

★ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతుడై ఉండాలి.

★ ఏ స్థాయిలోనూ అంటే కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల్లో ప్రభుత్వ ఆదాయం పొందే ఉద్యోగంలో ఉండకూడదు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, గవర్నర్ పదవులు లాభదాయక పదవుల కిందికి రావు.

★ దివాలా తీసి ఉండకూడదు.

పైన తెలిపిన అర్హతలతో పాటు కొన్ని షరతులను పాటించాల్సి ఉంటుంది. అవి:

★ రిజర్వ్ బ్యాంక్‌లో రూ. 15,000 ధరావత్తుగా చెల్లించాలి.

★ అభ్యర్థి నామినేషన్ పత్రాన్ని నియోజక గణంలోని 50 మంది సభ్యులు ప్రతిపాదించాలి. దీన్ని మరో 50 మంది బలపరచాలి.

పైన తెలిపిన అర్హతలు, షరతులను సవరించే అధికారం భారత పార్లమెంట్‌కు ఉంది.

**ఎన్నిక విధానం**

★ రాష్ట్రపతి ఎన్నికలను భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది. రాష్ట్రపతి ఎన్నికల్లో రాజకీయ పార్టీలు 'విప్' జారీ చేయలేవు

★ రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి పదవికి ఎన్నిసార్లైనా పోటీచేయవచ్చు (నిబంధన 57)

★ రాజ్యాంగంలోని 54, 55 నిబంధనలు రాష్ట్రపతి ఎన్నిక, ఎన్నిక విధానం గురించి వివరిస్తాయి.

★ రాష్ట్రపతి ఎన్నిక పరోక్షంగా, నైష్పత్తిక ప్రాతినిధ్య విధానం, ఏక ఓటు బదిలీ విధానం, రహస్య ఓటింగ్ పద్ధతిలో జరుగుతుంది. రాష్ట్రపతిని ఎన్నుకోవడానికి ప్రత్యేక ఎన్నికల గణం ఉంటుంది. ఎన్నికల గణంలో....

i) పార్లమెంట్ ఉభయసభలకు ఎన్నికైన మొత్తం సభ్యులు

ii) అన్ని రాష్ట్రాల విధానసభలకు ఎన్నికైన సభ్యులు

iii) కేంద్రపాలిత ప్రాంతాలైన దిల్లీ, పాండిచ్చేరి విధాన సభలకు ఎన్నికైన సభ్యులు (1992లో 70వ రాజ్యాంగ సవరణ చట్టం) ఉంటారు.

★ రాష్ట్రపతిగా ఎన్నికవడానికి కనీసం 50% పైగా ఓట్లు పొందాల్సి ఉంటుంది. ప్రాధాన్యతా క్రమాన్ని అనుసరించి 50% కి మించి ఓట్లు పొందే వరకు ఏక ఓటు బదిలీ ప్రక్రియ కొనసాగుతుంది.



R-18-10-16

★ రాష్ట్రపతి ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా ఒకసారి లోక్‌సభ సెక్రటరీ జనరల్, మరొకసారి రాజ్యసభ సెక్రటరీ జనరల్ వ్యవహరిస్తారు.

★ రాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించిన వివాదాలను స్వీకరించి, విచారించి, పరిష్కరించే అధికారం కేవలం సుప్రీంకోర్టుకు మాత్రమే ఉంది. ఎన్నికలు జరిగిన రోజు నుంచి 30 రోజుల లోపల ఎన్నికల గణంలోని సభ్యులు, పోటీచేసిన వారు మాత్రమే కోర్టులో కేసు దాఖలు చేయాలి.

## అధికారాలు, విధులు

రాజ్యాంగ నిబంధన 53 ప్రకారం కేంద్ర ప్రభుత్వ కార్యనిర్వహణాధికారం రాష్ట్రపతికి ఉంటుంది. రాష్ట్రపతి ఈ అధికారాలను స్వయంగా లేదా తన కింది అధికారుల ద్వారా నిర్వహిస్తారు. అంటే ప్రధాని నాయకత్వంలోని మంత్రిమండలి అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. నిబంధన 74(1) ప్రకారం ప్రధాని నాయకత్వంలోని కేంద్ర మంత్రివర్గం సలహా, సహాయంతో రాష్ట్రపతి తన విధులను నిర్వహించాల్సి ఉంటుంది.

రాష్ట్రపతి అధికారాలను ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి..

1) సాధారణ అధికారాలు

2) అత్యవసర అధికారాలు

## సాధారణ అధికారాలు

దేశం సాధారణ పరిస్థితుల్లో ఉన్నప్పుడు నిర్వహించే విధులు కింది విధంగా ఉంటాయి.

### కార్య నిర్వహణాధికారాలు

కార్య నిర్వహణ కోసం రాష్ట్రపతి అనేక నియామకాలు చేస్తారు. అందులో ముఖ్యమైనవి

★ లోక్‌సభలో మెజారిటీ పార్టీ నాయకుడిని ప్రధానిగా నియమిస్తారు – నిబంధన 75(1)

★ ప్రధాని సలహాపై మంత్రిమండలి – నిబంధన 75(1)

★ అటార్నీ జనరల్ – నిబంధన 76(1)

★ సుప్రీంకోర్టు, హైకోర్టు ప్రధాన, సాధారణ న్యాయమూర్తులు

★ కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, పరిపాలకులు – నిబంధన 239

★ భారత కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ – నిబంధన 148

★ అంతరాష్ట్రమండలి – నిబంధన 263

★ ఆర్థిక సంఘం ఛైర్మన్, సభ్యుల నియామకం – నిబంధన 280

★ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్, సభ్యులు – నిబంధన 316

★ భారత ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు – నిబంధన 329(2)

★ షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్, షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ ఛైర్మన్, సభ్యులు – నిబంధన 338, 338 (A)

★ వెనుకబడిన తరగతుల పరిస్థితుల అధ్యయనంపై కమిషన్ – నిబంధన 340

★ జాతీయ మానవ హక్కుల సంఘం, కేంద్ర విజిలెన్స్ కమిషన్ (CVC), కేంద్ర సమాచార కమిషన్, భాషాపరంగా అల్పసంఖ్యాక వర్గాల కమిషన్ మొదలైన అనేక కమిషన్‌లకు అధ్యక్షులను, సభ్యులను నియమిస్తారు.

### శాసనాధికారాలు

భారత పార్లమెంట్ అంటే రాష్ట్రపతి, రాజ్యసభ, లోక్‌సభ (నిబంధన 79). కాబట్టి రాష్ట్రపతి పార్లమెంట్‌లో అంతర్భాగం. రాష్ట్రపతికి అనేక శాసనాధికారాలున్నాయి.

★ పార్లమెంట్‌ను సమావేశపరచడం, వాయిదా వేయడం, సమావేశాలను రద్దు చేయడం – నిబంధన 85

★ పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించడం – నిబంధన 86

★ రాజ్యసభకు కళలు, సాహిత్యం, సామాజిక సేవ రంగాల్లో విశిష్టమైన 12 మందిని నియమించవచ్చు – నిబంధన 80(3)

★ లోక్‌సభలో ఆంగ్లో ఇండియన్స్‌కు తగిన ప్రాతినిధ్యం లేకపోతే ఆ వర్గం నుంచి ఇద్దరిని నియమిస్తారు – నిబంధన 331. ప్రస్తుత ఆంగ్లో ఇండియన్ సభ్యులు రిచర్డ్ హే, జార్జ్ బేకర్.

★ పార్లమెంట్ సమావేశంలో లేనప్పుడు ఆర్డినెన్స్‌లను జారీ చేయొచ్చు – నిబంధన 123. ఆర్డినెన్స్ గరిష్ఠ కాలపరిమితి 6 నెలల 6 వారాలు.

★ ఆర్థిక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి రాష్ట్రపతి ముందస్తు అనుమతి అవసరం – నిబంధన 117

★ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఆర్థిక సంఘం, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్‌ల నివేదికలను పార్లమెంట్‌కు సమర్పిస్తారు.

★ పార్లమెంట్ ఉభయసభలు ఆమోదించిన బిల్లుకు ఆమోదం తెలపడం.

★ రాష్ట్రపతికి 3 రకాల వీటో అధికారాలున్నాయి.

i) అబ్సల్యూట్ వీటో – ఏదైనా బిల్లును ఆమోదించడానికి నిరాకరించడం.

ii) సస్పెన్షన్ వీటో – ఏదైనా బిల్లును పునఃపరిశీలనకు పంపడం.

iii) పాకెట్ వీటో – బిల్లుకు ఆమోదం తెలపకుండా లేదా తిరస్కరించకుండా, పునఃపరిశీలనకు పంపకుండా తన దగ్గరే ఉంచుకోవడం.

★ ప్రధాని సలహాపై లోక్‌సభను రద్దు చేయవచ్చు (రాజ్యసభ శాశ్వత సభ).

**ఆర్థిక అధికారాలు**

★ కేంద్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేలా చూస్తారు – నిబంధన 112.

★ రాష్ట్రపతి అనుమతి లేకుండా కొత్త పన్నులు విధించడం, సవరించడం లాంటివి చేయడానికి వీలులేదు.

★ భారత ఆగంతుక నిధి రాష్ట్రపతి అధీనంలో ఉంటుంది – నిబంధన 267

★ కేంద్రం - రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల పునఃపంపిణీ కోసం 5 ఏళ్లకు ఒకసారి ఆర్థిక సంఘాన్ని నియమిస్తారు.

## పదవీకాలం

నిబంధన 56 ప్రకారం రాష్ట్రపతి పదవీ ప్రమాణస్వీకారం చేసిన రోజు నుంచి 5 సంవత్సరాలు పదవిలో ఉంటారు. అయితే కింది కారణాల వల్ల రాష్ట్రపతి పదవికి మధ్యలోనే ఖాళీ ఏర్పడవచ్చు.

★ రాజీనామా చేయడం

★ మహాభియోగ తీర్మానం

★ రాష్ట్రపతి ఎన్నిక చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం

★ మరణించడం (జాకీర్ హుస్సేన్ మరణం వల్ల 1967లో ఖాళీ ఏర్పడింది).

★ రాష్ట్రపతి రాజీనామాపత్రాన్ని ఉపరాష్ట్రపతి పేరు మీదుగా రాయాలి. ఆ పదవి ఖాళీగా ఉంటే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, ఆ పదవి కూడా ఖాళీగా ఉంటే సుప్రీంకోర్టులోని సీనియర్ న్యాయమూర్తికి తన రాజీనామా పత్రాన్ని పంపాలి.

## జీతభత్యాలు

59వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి జీతభత్యాలను పార్లమెంట్ నిర్ణయిస్తుంది. పార్లమెంట్‌కు రాష్ట్రపతి జీతభత్యాలను పెంచే అధికారం మాత్రమే ఉంది. తగ్గించే అధికారం లేదు. రాష్ట్రపతి జీతభత్యాలను భారత సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. ప్రస్తుతం

రాష్ట్రపతికి రూ. 1,50,000 నెలసరి వేతనం, ఉచిత అధికార నివాసం (రాష్ట్రపతి భవన్), కార్యాలయం, ఇతర ఖర్చుల కోసం రూ. 22.5 కోట్ల వరకు ఖర్చు చేయొచ్చు. పదవీ విరమణ తర్వాత పెన్షన్‌గా రూ. 75,000 చెల్లిస్తారు. రాష్ట్రపతికి హైదరాబాద్‌లోని బొల్లారంలో శీతాకాల విడిది, హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లాలో వేసవి విడిది గృహాలు ఉన్నాయి.

★ రాష్ట్రపతి భవన్ రూపకర్తలు ఎడ్విన్ లుటియన్స్, బేకర్.

★ రాష్ట్రపతి భవన్ ఉన్న ప్రాంతాన్ని రైసినా హిల్స్ అంటారు.

### పదవీ ప్రమాణస్వీకారం

నిబంధన 60 ప్రకారం రాష్ట్రపతి పదవికి ఎన్నికైన వ్యక్తి భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా సీనియర్ న్యాయమూర్తి సమక్షంలో కింది విధంగా ప్రమాణస్వీకారం చేయాలి.

'నేను ........ దేవుని (లేదా) మనఃసాక్షిగా ప్రమాణం చేసి ఈ రాష్ట్రపతి బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తాను. నా శాయశక్తులా రాజ్యాంగాన్ని, చట్టాన్ని కాపాడతాను (Preserve, Protect and Defend). భారత ప్రజల శ్రేయస్సు, సేవ కోసం నన్ను నేను అర్పించుకుంటాను'.

### తొలగింపు

నిబంధన 61(1) ప్రకారం 'రాజ్యాంగ ఉల్లంఘన' కారణంపై 'మహాభియోగ తీర్మానం' ద్వారా పార్లమెంట్ రాష్ట్రపతిని తొలగించగలదు. ఈ తీర్మానాన్ని పార్లమెంట్ ఉభయ సభలు విడివిడిగా మొత్తం సభ్యుల్లో 2/3 వ వంతు మెజారిటీతో ఆమోదించాలి. తీర్మానం ఆమోదం పొందిన రోజు నుంచి రాష్ట్రపతిని తొలగించినట్లు ప్రకటిస్తారు.

## మాదిరి ప్రశ్నలు

**1.** భారత రాష్ట్రపతికి ఉన్న అధికారాలు ఏవి?

ఎ) రాజ్యాంగబద్ధమైన అధికారాలు, నామమాత్ర అధికారాలు

బి) రాజ్యాంగబద్ధమైన అధికారాలు, వాస్తవ అధికారాలు

సి) వాస్తవ అధికారాలు, పార్లమెంట్ కల్పించిన అధికారాలు

డి) ఎ, బి, సి సరైనవి

**2.** రాష్ట్రపతిగా పోటీచేసే వ్యక్తిని ఎన్నికల గణంలోని ఎంతమంది సభ్యులు ప్రతిపాదించాలి?

ఎ) 150 మంది　　బి) 100 మంది　　సి) 50 మంది　　డి) 10 మంది

**3.** రాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనడానికి అవకాశం లేని సభ?

ఎ) లోక్‌సభ　　బి) రాజ్యసభ　　సి) విధానసభ　　డి) విధానమండలి

**4.** మూడో షెడ్యూల్‌లో కాకుండా రాజ్యాంగ నిబంధనల్లో ఎవరి ప్రమాణ స్వీకారం గురించి పొందుపరిచారు?

ఎ) రాష్ట్రపతి　　బి) ఉపరాష్ట్రపతి　　సి) గవర్నర్　　డి) ఎ, బి, సి

### జవాబులు

**1-ఎ; 2-సి; 3-డి; 4-డి.**

రచయిత: డాక్టర్ ఎం. భాస్కర రాజు

# ఇండియన్ పాలిటీ

## భారత రాష్ట్రపతి – అధికారాలు

### న్యాయాధికారాలు

రాష్ట్రపతికి సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకంతోపాటు, హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేసే అధికారమూ ఉంటుంది. బదిలీల విషయంలో రాష్ట్రపతి నిర్ణయం అంతిమం. అంతేగాక వీరు తమ రాజీనామా పత్రాలను రాష్ట్రపతి పేరు మీదుగా రాసి, ఆయనకే సమర్పించాల్సి ఉంటుంది.

★ ప్రజాప్రాధాన్యం ఉన్న అంశంపై 143వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాను కోరవచ్చు. సుప్రీంకోర్టు తప్పనిసరిగా సలహా ఇవ్వాలి. అయితే రాష్ట్రపతి ఆ సలహాను పాటించవచ్చు, పాటించకపోవచ్చు.

★ ఉన్నత న్యాయస్థానాలు విధించిన శిక్షల విషయంలో కేంద్ర మంత్రిమండలి సలహాపై 72వ నిబంధన ప్రకారం రాష్ట్రపతికి కింది అధికారాలు ఉంటాయి.

i) క్షమాభిక్ష – శిక్షను పూర్తిగా రద్దు చేయడం. దీన్నే Pardon అంటారు.

ii) శిక్ష కాలాన్ని తగ్గించడం (Remission)

iii) శిక్షలను మార్పు చేయడం (Commutation)

iv) శిక్ష అమలు కాకుండా వాయిదా వేయడం (Reprieve)

v) ప్రత్యేక పరిస్థితుల్లో తాత్కాలిక ఉపశమనం. (Respite)

★ శ్రీధర్ Vs గౌరు వెంకటరెడ్డి వివాదంలో (2006) సుప్రీంకోర్టు రాష్ట్రపతి క్షమాభిక్ష అధికారం కూడా న్యాయసమీక్షకు గురవుతుందని పేర్కొంది.

★ రాష్ట్రపతి విధి నిర్వహణ విషయంలో ఏ న్యాయస్థానానికీ జవాబు చెప్పాల్సిన అవసరం లేదు.

★ అధికారంలో ఉన్న రాష్ట్రపతిని అరెస్టు చేయకూడదు. క్రిమినల్ కేసులు పెట్టకూడదు. అయితే 2 నెలల ముందస్తు నోటీసుతో సివిల్ కేసు వేయొచ్చు.

### సైనిక అధికారాలు

★ నిబంధన 53(2) ప్రకారం రాష్ట్రపతి సర్వ సైనాధ్యక్షుడు. త్రివిధ దళాల అధిపతులను నియమిస్తాడు.

★ యుద్ధం ప్రకటించడానికి, శాంతి కోసం ఒప్పందాలు చేసుకోవడానికి అధికారం కలిగి ఉంటాడు. అయితే పార్లమెంట్ ఆమోదం అవసరం.

### దౌత్య అధికారాలు

★ రాష్ట్రపతికి విశేషమైన దౌత్య అధికారాలు ఉన్నాయి. విదేశాల్లో భారత రాయబారులను నియమిస్తారు. ఇతర దేశాల రాయబారుల నియామకాన్ని ఆమోదిస్తారు.

★ అంతర్జాతీయంగా భారతదేశం చేసుకునే ఒప్పందాలు రాష్ట్రపతి పేరుమీదుగా జరుగుతాయి. వీటికి పార్లమెంట్, రాష్ట్రపతి ఆమోదం అవసరం.

### అత్యవసర అధికారాలు

దేశంలో అత్యవసర (లేదా) అసాధారణ పరిస్థితులను ఎదుర్కోవడానికి రాజ్యాంగం 3 రకాల అత్యవసర అధికారాలను రాష్ట్రపతికి కల్పించింది.

**జాతీయ, అత్యవసర పరిస్థితి (నిబంధన 352):** యుద్ధం, విదేశీ దాడి, సాయుధ తిరుగుబాటు లాంటి కారణాల వల్ల దేశం లేదా దేశం లోని ఏదైనా ఒక ప్రాంత భద్రతకు భంగం కలుగుతుందని రాష్ట్రపతి భావిస్తే నిబంధన 352 ప్రకారం జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించవచ్చు. అయితే దీన్ని కేంద్ర కేబినెట్ లిఖిత పూర్వక సలహా మేరకు మాత్రమే ప్రకటించాల్సి ఉంటుంది.

★ కింది సందర్భాల్లో దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి విధించారు.

a) 1962 అక్టోబరు – 1968 మార్చి: చైనా దురాక్రమణ

b) 1971 డిసెంబరు – 1977 మార్చి: పాకిస్థాన్ దాడి

c) 1975 జూన్ – 1977 మార్చి: ఆంతరంగిక కల్లోలం

★ జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటించడం వల్ల కేంద్ర, రాష్ట్ర సంబంధాలు, ప్రాథమిక హక్కులపై విశేష ప్రభావం పడుతుంది.

**రాజ్యాంగ అత్యవసర పరిస్థితి:** రాజ్యాంగంలోని 356వ నిబంధన ప్రకారం ప్రకార ఏదైనా రాష్ట్రంలో రాజ్యాంగం ప్రకారం పరిపాలన నిర్వహించడం అసాధ్యమని సంబంధిత రాష్ట్ర గవర్నర్ చేసిన సిఫారసును అనుసరించి రాష్ట్రపతి ఆ రాష్ట్రంలో రాజ్యాంగ అత్యవసర పరిస్థితి ప్రకటించగలరు. దీన్ని 'రాష్ట్రపతి పాలన' అని కూడా అంటారు.

★ రాజ్యాంగ అత్యవసర పరిస్థితి ప్రకటనను పార్లమెంట్ సాధారణ మెజారిటీతో 2 నెలల్లోపు ఆమోదించాల్సి ఉంటుంది. ఒకసారి ఆమోదిస్తే 6 నెలల కాలం అమల్లో ఉంటుంది. దీన్ని కొనసాగించాలంటే పార్లమెంట్ ఆమోదం అవసరం. గరిష్ఠంగా 3 సంవత్సరాల వరకు పొడిగించవచ్చు.

**ఆర్థిక అత్యవసర పరిస్థితి (నిబంధన 360):** దేశం మొత్తం లేదా ఏదైనా రాష్ట్రం ఆర్థిక సంక్షోభం లేదా తీవ్రమైన అప్పుల ఊబిలోకి వెళ్తోందని రాష్ట్రపతి భావిస్తే నిబంధన 360 ప్రకారం ఆర్థిక అత్యవసర పరిస్థితి ప్రకటించవచ్చు.

★ ఆర్థిక అత్యవసర పరిస్థితి ప్రకటనను పార్లమెంట్ సాధారణ మెజారిటీతో 2 నెలల్లోపు ఆమోదించాల్సి ఉంటుంది. ఒకసారి పార్లమెంట్ ఆమోదిస్తే, తర్వాత రాష్ట్రపతి రద్దుచేసేంతవరకు కొనసాగుతుంది. ఇప్పటివరకు దీన్ని ఒక్కసారి కూడా విధించలేదు.

★ ఆర్థిక అత్యవసర పరిస్థితి ప్రకటిస్తే సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల జీతభత్యాలతో సహా కేంద్ర, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల జీతాలను కూడా తగ్గించవచ్చు.

★ చివరగా రాష్ట్రపతికి రాజ్యాంగ పరిరక్షకుడిగా బాధ్యతలు ఉన్నా రాజ్యాంగపరంగా విచక్షణాధికారాలు లేవు.

## మాదిరి ప్రశ్నలు

**1.** ఏ నిబంధన ప్రకారం రాష్ట్రపతి తన విధులను మంత్రిమండలి సహాయం, సలహామేరకు మాత్రమే నిర్వహించాల్సి ఉంటుంది?

ఎ) నిబంధన 52 బి) నిబంధన 74 సి) నిబంధన 75 డి) నిబంధన 76

**2.** రాష్ట్రపతిపై మహాభియోగ తీర్మానం ఏ కారణంపై ప్రవేశపెట్టవచ్చు?

ఎ) అవినీతి బి) అసమర్థత సి) రాజ్యాంగ ఉల్లంఘన డి) అనారోగ్యం

**3.** దిల్లీలో రాష్ట్రపతి భవన్ ఉన్న ప్రాంతాన్ని ఏ పేరుతో పిలుస్తారు?

ఎ) రైసినా హిల్స్ బి) హార్సిలీ హిల్స్ సి) సిమ్లా డి) జనపథ్

**4.** మొదటిసారిగా నిబంధన 356 ప్రకారం రాజ్యాంగ అత్యవసర పరిస్థితి లేదా రాష్ట్రపతి పాలనను ఏ రాష్ట్రంలో విధించారు?

ఎ) కేరళ బి) ఉత్తర్ ప్రదేశ్ సి) జమ్మూ, కశ్మీర్ డి) పంజాబ్

**5.** ఒక బిల్లును రాష్ట్రపతి పునఃపరిశీలన కోసం మంత్రిమండలికి పంపవచ్చు. అయితే మంత్రిమండలి పునఃపరిశీలన తర్వాత రాష్ట్రపతి వద్దకు వచ్చిన బిల్లుపై తప్పక సంతకం చేయాలని తెలిపే రాజ్యాంగ సవరణ చట్టమేది?

ఎ) 42వ రాజ్యాంగ సవరణ చట్టం, 1976 బి) 44వ రాజ్యాంగ సవరణ చట్టం, 1978

సి) 38వ రాజ్యాంగ సవరణ చట్టం, 1975 డి) 25వ రాజ్యాంగ సవరణ చట్టం, 1971

**6.** రాజ్యాంగంలోని నిబంధన 78 ప్రకారం రాష్ట్రపతికి ఏ హక్కు ఉంది?

ఎ) జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించడం బి) రాష్ట్ర గవర్నర్ నుంచి సమాచారాన్ని కోరడం

సి) భారత ప్రధానమంత్రి నుంచి సమాచారాన్ని కోరడం డి) రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి సమాచారాన్ని కోరడం

7. హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేసే అధికారం ఎవరికి ఉంది?

ఎ) రాష్ట్ర గవర్నర్ బి) రాష్ట్రపతి

సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి) ప్రధానమంత్రి

8. ఒక రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్, సభ్యులను తొలగించే అధికారం ఎవరికి ఉంది?

ఎ) రాష్ట్రపతి బి) రాష్ట్ర గవర్నర్ సి) ముఖ్యమంత్రి డి) ప్రధానమంత్రి

9. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతికి కింది ఏ అధికారాలు లేవు?

ఎ) కార్య నిర్వహణాధికారాలు బి) విచక్షణాధికారాలు

సి) శాసనాధికారాలు డి) న్యాయాధికారాలు

10. పాకెట్ వీటోను ఉపయోగించిన ఏకైక రాష్ట్రపతి ఎవరు?

ఎ) కె.ఆర్. నారాయణన్ బి) ఎ.పి.జె. అబ్దుల్ కలాం

సి) డా. బాబూ రాజేంద్రప్రసాద్ డి) జ్ఞానీ జైల్‌సింగ్

11. 'అంతరంగిక కల్లోలం' కారణంతో జాతీయ అత్యవసర పరిస్థితి విధించిన కాలం....

ఎ) 1975 – 77 బి) 1971 – 77 సి) 1962 – 68 డి) 1978 – 80

12. ఇప్పటివరకు నిబంధన 356 ప్రకారం రాష్ట్రపతి పాలన విధించని రాష్ట్రాలు ఏవి?

ఎ) పంజాబ్, కేరళ బి) చత్తీస్‌గఢ్, తెలంగాణ

సి) రాజస్థాన్, గుజరాత్ డి) ఏవీకాదు

13. దేశంలో ఆర్థిక అత్యవసర పరిస్థితిని ఎన్నిసార్లు విధించారు?

ఎ) 3 బి) 5 సి) 126 డి) విధించలేదు

14. రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించడానికి రాజ్యాంగం ప్రకారం కింది ఎవరి నుంచి లిఖితపూర్వక సలహా అవసరం?

ఎ) ప్రధాన మంత్రి బి) కేంద్ర కేబినెట్ సి) ఉపరాష్ట్రపతి డి) సలహా అవసరం లేదు

15. రాష్ట్రపతి తన విధి నిర్వహణలో ఎవరికి జవాబుదారీగా ఉంటారు?

ఎ) సుప్రీంకోర్టు బి) ప్రధానమంత్రి సి) క్యాబినెట్ డి) ఎవరికీ కాదు

**జవాబులు**

**1–బి; 2–సి; 3–ఎ; 4–డి; 5–బి; 6–సి; 7–బి; 8–ఎ; 9–బి; 10–డి; 11–ఎ; 12–బి; 13–డి; 14–బి; 15–డి.**

★ సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తులకు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానాన్ని (అసమర్థత, దుష్ప్రవర్తన కారణాల పై) పార్లమెంట్ ఉభయ సభలు విడివిడిగా ప్రత్యేక మెజారిటీతో ఆమోదిస్తే, వారిని రాష్ట్రపతి తొలగించవచ్చు.

★ అత్యవసర పరిస్థితి ప్రకటనను పార్లమెంట్ నెల లేదా 30 రోజుల్లోపు 2/3వ వంతు మెజారిటీతో విడివిడిగా ఉభయ సభలు ఆమోదించాల్సి ఉంటుంది. పార్లమెంట్ ఒకసారి ఆమోదిస్తే అది 6 నెలలపాటు అమల్లో ఉంటుంది. దీన్ని తిరిగి ఆమోదించడం ద్వారా పొడిగించవచ్చు.

★ నీలం సంజీవరెడ్డి అత్యంత చిన్న వయసులో రాష్ట్రపతి పదవికి ఎన్నికయ్యారు.

**రచయిత: డాక్టర్ ఎం. భాస్కర రాజు**

# ఇండియన్ పాలిటీ

## భారత రాష్ట్రపతి

**1.** కిందివాటిలో భారత రాష్ట్రపతి గురించి తప్పుగా పేర్కొన్నది ఏది?

1) ప్రభుత్వాధినేత
2) ప్రథమ పౌరుడు
3) త్రివిధ దళాల అధిపతి
4) దేశాధినేత

**2.** రాష్ట్రపతి ఎన్నికకు ఏ విధానాన్ని అనుసరిస్తారు?

1) నైష్పత్తిక ప్రాతినిధ్య విధానం
2) ఒక ఓటును బదిలీచేసే పద్ధతి
3) రహస్య బ్యాలెట్ ఓటింగ్
4) అన్నీ

**3.** రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన అన్ని వివాదాలను పరిశీలించి, తీర్పు ఇచ్చేది ఎవరు?

1) భారత ఎన్నికల సంఘం
2) భారత సుప్రీంకోర్టు
3) భారత పార్లమెంట్
4) భారత అటార్నీ జనరల్

**4.** ఒకవేళ రాజీనామా, తొలగింపు, మరణం లాంటి ఇతర కారణాల వల్ల రాష్ట్రపతి పదవి ఖాళీ అయితే ...... (కిందివాటిలో సరైన సమాధానాన్ని గుర్తించండి.)

A) ఆ ఖాళీ ఏర్పడిన ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది.

B) కొత్త రాష్ట్రపతి ఎన్నికయ్యే వరకు ఉపరాష్ట్రపతి రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తారు.

C) కొత్తగా ఎన్నికైన రాష్ట్రపతి మిగిలిన సమయానికి కాకుండా పూర్తిగా 5 సంవత్సరాలు పదవిలో కొనసాగుతారు.

1) A, B మాత్రమే
2) A, C మాత్రమే
3) B, C మాత్రమే
4) అన్నీ సరైనవే

**5.** పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ఏయే బిల్లుల విషయంలో ముందుగా రాష్ట్రపతి అనుమతి పొందాల్సి ఉంటుంది?

1) సాధారణ బిల్లులు
2) రాజ్యాంగ సవరణ బిల్లులు
3) ఆర్థిక బిల్లులు
4) అన్నీ

**6.** కిందివారిలో రాష్ట్రపతిని ఎన్నుకునే ఎలక్టోరల్ కాలేజీలో సభ్యులు కానివారు ఎవరు?

1) ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు
2) ఎన్నికైన రాష్ట్రాల విధానసభ సభ్యులు
3) దిల్లీ, పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభలకు ఎన్నికైన సభ్యులు
4) రాష్ట్రాల విధాన మండలి సభ్యులు

**7.** రాష్ట్రపతి పదవికి పోటీచేసే అభ్యర్థి నామినేషన్‌ను ఎంతమంది ఎలక్టోరల్ కాలేజీ సభ్యులు ధ్రువీకరించాలి (Proposers)? ఎంత మంది సమర్థించాలి (Seconders)?

1) 50, 100
2) 60, 75
3) 75, 125
4) 50, 50

**8.** సాధారణంగా రాష్ట్రపతితో ప్రమాణస్వీకారం ఎవరు చేయిస్తారు?

1) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
2) ఉపరాష్ట్రపతి
3) లోక్‌సభ స్పీకర్
4) భారత అటార్నీ జనరల్

**9.** కింద తెలిపిన ఆర్టికల్స్‌ను రాష్ట్రపతికి సంబంధించిన అంశాలతో జతపరచండి.

A) ఆర్టికల్ 123 — I) రాష్ట్రపతి సుప్రీంకోర్టును సంప్రదించే అధికారం

B) ఆర్టికల్ 72 — II) మహాభియోగ తీర్మానం

C) ఆర్టికల్ 61 — III) క్షమాభిక్ష ప్రసాదించే అధికారం

D) ఆర్టికల్ 143 — IV) ఆర్డినెన్స్‌లు జారీచేసే అధికారం

1) A-I, B-II, C-III, D-IV
2) A-I, B-III, C-II, D-IV
3) A-IV, B-III, C-II, D-I
4) A-IV, B-II, C-III, D-I

**10.** కిందివాటిలో రాష్ట్రపతి గురించి తప్పుగా పేర్కొన్నది ఏది?

1) విధుల్లోకి వచ్చిన తేదీ నుంచి అయిదు సంవత్సరాలపాటు పదవిలో కొనసాగుతారు.
2) తన రాజీనామా పత్రాన్ని ఉపరాష్ట్రపతికి అందజేయాలి.
3) రెండు కంటే ఎక్కువ పర్యాయాలు రాష్ట్రపతిగా ఎన్నికవడానికి వీల్లేదు.
4) మహాభియోగ తీర్మానం ద్వారా రాష్ట్రపతిని పదవి నుంచి తొలగించవచ్చు.

**11.** రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవులు రెండూ ఖాళీ అయిన సందర్భంలో రాష్ట్రపతిగా ఎవరు పదవీబాధ్యతలు నిర్వహిస్తారు?

1) లోక్‌సభ స్పీకర్
2) రాజ్యసభ ఉపాధ్యక్షుడు
3) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
4) భారత అటార్నీ జనరల్

**12.** రాష్ట్రపతిగా పనిచేసే వ్యక్తికి ఉన్న విశేషాధికారాలు, రక్షణల విషయంలో కిందివాటిలో సరైనవి గుర్తించండి.

A) రాష్ట్రపతిపై ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం లేదు.
B) రాష్ట్రపతిని అరెస్ట్ చేయకూడదు.
C) రాష్ట్రపతిని జైలులో ఉంచకూడదు.
D) రెండు నెలల ముందు నోటీసు ఇచ్చి సివిల్ కేసులను దాఖలు చేయవచ్చు.

1) A, B, C మాత్రమే
2) B, C, D మాత్రమే
3) A, C, D మాత్రమే
4) అన్నీ సరైనవే

**13.** రాష్ట్రపతి జారీచేసే ఆర్డినెన్స్ గరిష్ఠ కాలపరిమితి ఎంత?

1) 3 నెలలు
2) 6 నెలలు
3) 6 వారాలు
4) 6 నెలల 6 వారాలు

**14.** రాష్ట్రపతిపై జరిగే మహాభియోగ తీర్మానంలో ఎవరు పాల్గొంటారు?

1) పార్లమెంట్ ఉభయసభల సభ్యులు
2) దిల్లీ, పాండిచ్చేరి కేంద్రపాలిత ప్రాంత శాసనసభల సభ్యులు
3) రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికైన సభ్యులు
4) పైవారందరూ

**15.** రాష్ట్రపతిని తొలగించడానికి ప్రవేశపెట్టే మహాభియోగ తీర్మాన నోటీసును ఎన్ని రోజుల ముందుగా రాష్ట్రపతికి అందజేయాల్సి ఉంటుంది?

1) 5
2) 9
3) 14
4) 16

**16.** రాష్ట్రపతికి ఉన్న వీటో అధికారాలను సంబంధిత వివరణలతో జతపరచండి.

A) అబ్సల్యూట్ వీటో — I) బిల్లును పునఃపరిశీలన కోసం పార్లమెంట్‌కు పంపించడం

B) సస్పెన్సివ్ వీటో — II) పార్లమెంట్ ఆమోదం పొందిన బిల్లును తిరస్కరించడం

C) పాకెట్ వీటో — III) బిల్లును ఆమోదించకుండా/ తిరస్కరించకుండా తన వద్దే ఉంచుకోవడం

1) A-I, B-II, C-III
2) A-II, B-I, C-III
3) A-I, B-III, C-II
4) A-III, B-II, C-I

**17.** రాష్ట్రపతి పదవికి పోటీచేసే అభ్యర్థి ధరావత్తు కింద (సెక్యూరిటీ డిపాజిట్) రూ. 15,000 లను ఎక్కడ డిపాజిట్ చేయాలి?

1) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో
2) నగదు రూపంలో రిటర్నింగ్ ఆఫీసర్ దగ్గర
3) గవర్నమెంట్ ట్రెజరీలో
4) పై మూడింటిలో ఏదైనా ఒకచోట

**18.** రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి ఇష్టం ఉన్నంత కాలం పదవిలో కొనసాగేవారు ఎవరు?

1) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా
2) యూపీఎస్సీ ఛైర్మన్
3) భారత ఎన్నికల ప్రధానాధికారి
4) అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా

**19.** 'రాష్ట్రపతి తన విధులను, అధికారాలను ప్రధాని అధ్యక్షతన ఉన్న మంత్రిమండలి సలహా, సహాయ అధికారాలకు అనుగుణంగా వినియోగించుకోవాల్సి ఉంటుంది' అని పేర్కొనే ఆర్టికల్ ఏది?

1) 71
2) 72
3) 73
4) 74

**20.** కింద పేర్కొన్న మాజీ రాష్ట్రపతులను వారి పదవీకాలం ప్రకారం వరుసక్రమంలో అమర్చండి.

A) ప్రతిభా పాటిల్
B) జ్ఞానీ జైల్‌సింగ్
C) జాకీర్ హుస్సేన్
D) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
E) శంకర్‌దయాళ్ శర్మ

1) C, B, A, D, E
2) B, C, E, D, A
3) C, D, B, E, A
4) D, C, E, B, A

**21.** రాష్ట్రపతి ఎంతమందిని పార్లమెంట్ సభ్యులుగా నామినేట్ చేస్తారు?

1) 12
2) 2
3) 13
4) 14

**22.** ఒక వ్యక్తికి రాష్ట్ర చట్టం మరణశిక్ష విధిస్తే, క్షమాభిక్ష (Pardon) ప్రకటించే అధికారం ఎవరికి ఉంటుంది?

1) రాష్ట్ర గవర్నర్‌కు
2) రాష్ట్ర హైకోర్టుకు
3) రాష్ట్ర మంత్రిమండలి సలహాపై రాష్ట్ర గవర్నర్‌కు
4) కేవలం రాష్ట్రపతికి మాత్రమే

**23.** భారత రాష్ట్రపతి ఎన్నికను ఎవరు నిర్వహిస్తారు?

1) భారత పార్లమెంట్ సెక్రటేరియట్
2) భారత ఎన్నికల సంఘం
3) కేంద్ర ప్రభుత్వం
4) రాష్ట్రపతి భవన్ కార్యాలయం

**24.** కిందివాటిలో రాష్ట్రపతి పదవికి సంబంధించిన అంశాలు, వాటి ఆధార దేశ రాజ్యాంగాల్లో తప్పుగా జతపరిచిన దాన్ని గుర్తించండి.

A) రాష్ట్రపతి ఎన్నిక విధానం – ఐర్లాండ్

B) మహాభియోగ తీర్మానం – అమెరికా

C) రాష్ట్రపతి నామమాత్రంగా ఉండటం – బ్రిటన్

1) A మాత్రమే 2) B మాత్రమే 3) C మాత్రమే 4) అన్నీ సరైనవే

**25.** రాష్ట్రపతికి ఉన్న క్షమాభిక్ష అధికారంలోని అంశాలను, వాటి వివరణలతో జతపరచండి.

A) మార్పు (Commutation) — I) వాస్తవంగా విధించిన శిక్ష స్థానంలో మానవతా దృక్పథంతో తక్కువ శిక్షను విధించడం

B) మినహాయింపు (Remission) — II) శిక్ష అమలును కొంత కాలం వాయిదా వేయడం

C) విరామం (Respite) — III) ఒక రకమైన శిక్ష స్థానంలో మరొక తక్కువ తీవ్రత ఉన్న శిక్ష విధించడం

D) నిలుపుదల (Reprieve) — IV) శిక్షా కాలాన్ని తగ్గించడం

1) A-III, B-I, C-IV, D-II 2) A-II, B-IV, C-I, D-III

3) A-II, B-I, C-IV, D-III 4) A-III, B-IV, C-I, D-II

**26.** ఆర్టికల్ 111 ప్రకారం పార్లమెంట్ ఉభయసభలు ఆమోదించిన బిల్లులు శాసనం / చట్టంగా రూపొందాలంటే ఎవరి ఆమోదం/ సంతకం అవసరం?

1) ప్రధానమంత్రి 2) కేంద్ర హోంశాఖామంత్రి

3) రాష్ట్రపతి 4) ఉపరాష్ట్రపతి

**27.** ఏ ఆర్టికల్ ఆదేశానుసారం రాష్ట్రపతి పార్లమెంట్ ఉభసభల సంయుక్త సమావేశాన్ని ఏర్పాటుచేస్తారు?

1) 100 2) 104 3) 108 4) 112

**28.** కిందివాటిలో మహాభియోగ తీర్మానం (Impeachment) గురించి సరైన వాక్యాన్ని గుర్తించండి.

A) పార్లమెంట్ ఉభయ సభల్లో ఏ సభలోనైనా దీన్ని ప్రవేశపెట్టవచ్చు.

B) ఈ తీర్మానాన్ని ఉభయసభలు $\frac{2}{3}$ వ వంతు మెజారిటీతో ఆమోదిస్తే, రాష్ట్రపతి తన పదవిని కోల్పోతాడు.

C) ఇప్పటివరకు ఏ రాష్ట్రపతినీ ఈ తీర్మానం ద్వారా తొలగించలేదు.

D) ఈ తీర్మాన ప్రతిపాదనపై సంబంధిత సభ సభ్యుల్లో $\frac{1}{4}$ వ వంతు మంది సంతకాలు చేయాలి.

1) A, B, C 2) B, C, D 3) A, B, D 4) A, B, C, D

**29.** రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతికి ఉన్న విచక్షణాధికారాల్లో అత్యవసర అధికారాలు ఏవి?

1) జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటన 2) రాజ్యాంగ అత్యవసర పరిస్థితి ప్రకటన

3) ఆర్థిక అత్యవసర పరిస్థితి ప్రకటన 4) అన్నీ

**30.** కిందివాటిలో రాష్ట్రపతి శాసనాధికారాల్లో లేనిది ఏది?

1) పార్లమెంట్‌ను సమావేశపరిచే అధికారం

2) పార్లమెంట్‌ను దీర్ఘకాలం వాయిదావేసే అధికారం

3) పార్లమెంట్ ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఏర్పాటుచేసే అధికారం

4) రాజ్యసభను రద్దుచేసే అధికారం

**31.** ఇటీవల విడుదలైన 'ది ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్' పుస్తకం ఏ రాష్ట్రపతి ఉన్నత విద్యారంగానికి అందించిన సేవల గురించి తెలియజేస్తుంది?

1) ప్రణబ్ ముఖర్జీ
2) ఎ.పి.జె. అబ్దుల్ కలాం
3) సర్వేపల్లి రాధాకృష్ణన్
4) కె.ఆర్. నారాయణన్

**32.** మాజీ రాష్ట్రపతులను, వారి ప్రత్యేకతలతో జతపరచండి.

A) డా. బాబూ రాజేంద్రప్రసాద్ — I) ఏకగ్రీవంగా ఎన్నికైన ఏకైక రాష్ట్రపతి
B) వి.వి. గిరి — II) రాష్ట్రపతిగా పనిచేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
C) నీలం సంజీవరెడ్డి — III) వరుసగా రెండుసార్లు ఎన్నికైన రాష్ట్రపతి
D) మహ్మద్ హిదయతుల్లా — IV) అతితక్కువ మెజార్టీతో గెలిచిన రాష్ట్రపతి

1) A-III, B-IV, C-I, D-II
2) A-III, B-I, C-IV, D-II
3) A-II, B-IV, C-I, D-III
4) A-II, B-I, C-IV, D-III

**33.** రాష్ట్రపతి ఎన్నికలో పోలైన ఓట్లలో ఎన్నో వంతు ఓట్లు పొందకపోతే ధరావత్తు సొమ్మును కోల్పోవాల్సి ఉంటుంది?

1) $\frac{1}{10}$  2) $\frac{1}{15}$  3) $\frac{1}{6}$  4) $\frac{1}{9}$

**34.** ప్రస్తుతం రాష్ట్రపతి నెల జీతం ఎంత?

1) రూ. 1,00,000  2) రూ. 1,50,000  3) రూ. 2,00,000  4) రూ. 2,50,000

**35.** మనదేశంలో ఆంతరంగిక జాతీయ అత్యవసర పరిస్థితిని (1975 జూన్‌లో) ప్రకటించిన రాష్ట్రపతి ఎవరు?

1) వి.వి. గిరి  2) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్  3) జ్ఞానీ జైల్‌సింగ్  4) బి.డి. జెట్టి

**36.** కిందివారిలో ఎవరిని రాష్ట్రపతి నియమించరు?

A) రాష్ట్ర గవర్నర్‌లు
B) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
C) లోక్‌సభ స్పీకర్
D) విదేశీ రాయబారులు
E) సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు
F) రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్

1) D, C మాత్రమే  2) B, C మాత్రమే  3) D, F మాత్రమే  4) C, F మాత్రమే

**జవాబులు**

1–1; 2–4; 3–2; 4–4; 5–3; 6–4; 7–4; 8–1; 9–3; 10–3; 11–3; 12–4; 13–4; 14–1; 15–3; 16–2; 17–4; 18–4; 19–4; 20–3; 21–4; 22–4; 23–2; 24–4; 25–4; 26–3; 27–3; 28–4; 29–4; 30–4; 31–1; 32–1; 33–3; 34–2; 35–2; 36–4.

**రచయిత: టి. రామకృష్ణ**

www.eenadupratibha.net